


నేడు సీఎం చంద్రబాబు రాక

బీచ్‌రోడ్డులో యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

- హోటల్ నోవాటెల్‌లో అధికారులతో సమీక్ష
- వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యకర్తల సమావేశం



విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు సోమవారం విశాఖ రానున్నారు. ఉదయం 11 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 11.40కు విశాఖ చేరుకుంటారు. పది నిమిషాలపాటు ఎయిర్‌పోర్టులో గడిపాక 11.50 గంటలకు బయలుదేరి 12.10కు ఆర్కే బీచ్ రోడ్డులోని కాళీమాత గుడి వద్దకు చేరుకుంటారు. 12.40 గంటల వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తారు. 12.45 గంటలకు బయలుదేరి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుని అక్కడ యోగా దినోత్సవ ఏర్పాట్లను తిలకిస్తారు. మధ్యాహ్నం 1.05 గంటలకు హోటల్ నోవాటెల్‌కు వెళతారు. భోజన విరామం తరువాత 2.15 నుంచి 3.30 గంటల వరకు యోగా దినోత్సవంపై అధికారులతో సమీక్షిస్తారు. తరువాత 3.40 గంటలకు బయలుదేరి నాలుగు గంటలకు పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని, సాయంత్రం ఆరు గంటల వరకు పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి 6.15 గంటలకు రాజేంద్రనగర్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఇంటికి చేరుకుంటారు. ఇటీవల మృతి చెందిన ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి 6.45కు విమానాశ్రయానికి చేరుకుంటారు. 6.55 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళతారు.

వలస పక్షులు

ముందస్తు వ్యూహంతో కూటమి పార్టీల్లోకి వైసీపీ నేతలు

- పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా సహజ వనరుల దోపిడీ
- గత ఏడాది ఎన్నికల్లో ఓడిపోగానే కూటమి పార్టీలవైపు చూపులు
- ఎలమంచిలి నియోజకవర్గంలో క్యూ కడుతున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, మాజీలు..
- అత్యధికులు జనసేన పార్టీలో చేరిక
- వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులే లక్ష్యం



ఎలమంచిలి పట్టణం

అచ్యుతాపురం/ ఎలమంచిలి/ రాంబిల్లి/ మునగపాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు అధికారాన్ని అనుభవించి, పెత్తనం చెలాయించిన ఆ పార్టీ నేతలు పలువురు...కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కండువాలు మార్చేస్తున్నారు. వచ్చే ఏడాది జరగనున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పట్టుసడలకుండా ఉండడానికి అధికారంలో ఉన్న పార్టీల పంచన చేరుతున్నారు. ఈ విషయంలో జిల్లాలో ఎలమంచిలి నియోజకవర్గం మొదటి వరుసలో ఉంది. వైసీపీకి చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు స్థానిక రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరారు. వీరిలో ఎక్కువ మంది స్థానిక రాజకీయ శూన్యతను దృష్టిలో పెట్టుకుని జనసేనలో చేరుతున్నారు. మరికొంతమంది క్యూలో ఉన్నారు.

నాలుగేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎలమంచిలి నియోజకవర్గంలో 90 శాతం సర్పంచు పదవులను వైసీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. మొత్తం 103 పంచాయతీలకుగాను 91 పంచాయతీల్లో వైసీపీ పాగా వేసింది. మరో ఆరు నెలల తరువాత జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని స్థానాలను (58) వైసీపీ గెలుచుకుంది (కొంతకాలం తరువాత అచ్యుతాపురం మండలం దిబ్బపాలెంలో ఒక ఎంపీటీసీ మెంబర్ మరణించడంతో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుపొందింది). ఎమ్మెల్యే అండతో పలువురు సర్పంచులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. గ్రావెల్, ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, భూ దందాలు సాగించారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల నేతలు సెజ్ కంపెనీల్లో వివిధ రకాల కాంట్రాక్టులను బలవంతంగా చేజిక్కించుకున్నారు. రెండు చేతులా ఎడాపెడా సంపాదించేశారు. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో వీళ్ల అక్రమాలకు అడ్డుకట్ట పడింది. గ్రామాల్లో కూటమి నేతలు పట్టు సాధించారు. వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఇది మింగుడు పడడంలేదు. ఐదేళ్లపాటు అధికారాన్ని అడ్డంపెట్టుకుని అడ్డగోలు సంపాదనకు అలవాటుపడిన వైసీపీ నేతలు...గ్రామాల్లో తమ పట్టు సడలకుండా వుండడానికి అధికారంలో వున్న టీడీపీ, జనసేన, బీజేపీల్లో చేరడం మొదలుపెట్టారు. అయితే కొంతమంది మాత్రం గత ఎమ్మెల్యేతో పొసగక ఎన్నికల ముందే కూటమి పార్టీల్లో చేరారు. ఎన్నికల తరువాత వైసీపీ నుంచి కొందరు కూటమిలోకి క్యూ కడుతున్నారు. వలస పక్షుల్లో అత్యధికులు జనసేలో చేరారు. ఆయా గ్రామాల్లో టీడీపీకి బలమైన నాయకత్వం వుండడమే ఇందుకు కారణమని విశ్లేషిస్తున్నారు. వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేస్తే గెలిచే పరిస్థితి లేకపోవడం, మరోవైపు పొత్తులో భాగంగా కనీసం 30 శాతం స్థానాలను తీసుకోవాలని జనసేన అధిష్ఠానం భావిస్తుండడంతో, ఆ పార్టీ తీసుకునే పంచాయతీలు/ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేయాలన్న ఉద్దేశంతోనే ఎక్కువ మంది జనసేనలో చేరుతున్నట్టు తెలిసింది. ఆర్థికంగా బలంగా వుండడంతో ఎన్నికల్లో ఎంతైనా ఖర్చుపెడతామని చెప్పి టికెట్లు పొందే ప్రయత్నం చేయవచ్చన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. వైసీపీ నేతలు తమ సొంత అభివృద్ధే ముఖ్యమన్న ఉద్దేశంతోనే పార్టీ మారుతున్నారని స్థానికంగా చెప్పుకుంటున్నారు.

ఎన్నికల ముందు కూటమిలో చేరినవారు..

ఎలమంచిలి మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజుతో పొసగక అచ్యుతాపురం మండలం ఖాజీపాలెం ఎంపీటీసీ సభ్యురాలు పీలా ధనలక్ష్మి (సందీప్), చిప్పాడ ఎంపీటీసీ సభ్యుడు రాజాన పైడి భాస్కరరావు, పూడిమడక ఎంపీటీసీ సభ్యురాలు పోలవరం లక్ష్మీకాంతం, అచ్యుతాపురం ఎంపీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి (బాపూజీ) ఎన్నికల ముందే జనసేనలో చేరారు. దొప్పెర్ల సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు, నునపర్తి సర్పంచ్ చుక్క అనూరాధ బీజేపీలో చేరారు. దిబ్బపాలెం ఉపసర్పంచ్ రాజాన విజయ్ టీడీపీలో చేరారు. రాంబిల్లి మండలంలో వైఎస్ ఎంపీపీ, దిమిలి ఎంపీటీసీ సభ్యురాలు కోటావు లక్ష్మి, వెల్చూరు సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మ, రాజుకోడూరు సర్పంచ్ ముత్రా శంకరరావు, మామిడివాడ సర్పంచ్ మట్టా అప్పలనర్స, కొత్తూరు ఎంపీటీసీ శానాపతి రత్నం, గోకివాడ ఎంపీటీసీ సభ్యుడు అల్లవరపు నాగేశ్వరరావు, మునగపాక మండలం నాగవరం ఎంపీటీసీ సభ్యుడు పాలిపిని శ్రీనివాసరావు ... మిగతా 6వ పేజీలో

బడి బ్యాగు బరువు తగ్గింది

సెమిస్టర్ విధానంలో పాఠ్య పుస్తకాల ముద్రణ

- 1, 2 తరగతులకు ఒక పాఠ్య పుస్తకం, ఒక వర్క్ బుక్
- 3, 4, 5 క్లాసులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒక పుస్తకం
- లెక్కలు, ఈవీఎస్ కలిపి ఒక పుస్తకం, ఒక వర్క్‌బుక్
- భాషా పాఠ్యాంశాలు తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒక పాఠ్య పుస్తకం



ఆరు నుంచి తొమ్మిది తరగతులకు తెలుగు, ఆంగ్లం, హిందీ కలిపి ఒక పాఠ్య పుస్తకంగా ఉన్న దృశ్యం

నర్సీపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బ్యాగులో ప్రతి సబ్జెక్టుకి ఒక పాఠ్య పుస్తకం తీసుకు వెళ్లే రోజులు పోయాయి. ప్రభుత్వం సెమిస్టర్ విధానం తీసుకు వచ్చి భాషా పాఠ్యాంశాలు.. తెలుగు, హిందీ, ఆంగ్లం కలిపి ఒక పాఠ్య పుస్తకంగా చేయడంతో విద్యార్థులకు పుస్తకాల మోత తగ్గింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 9వ తరగతి వరకు రెండు, మూడు సబ్జెక్టులు కలిపి ఒక పాఠ్య పుస్తకం చేయడంతో విద్యార్థుల బ్యాగు కొంత తేలికైంది. ఇప్పటి వరకు భాషా పాఠ్యాంశాల (తెలుగు, ఆంగ్లం, హిందీ) పుస్తకాలు విడివిడిగా ముద్రించేవారు. ఇప్పుడు మూడు పాఠ్య పుస్తకాలకు బదులు ఒక పాఠ్య పుస్తకంతో సరిపోతుంది. దీని వల విద్యార్థిపై ఒత్తిడి తగ్గుతుంది. తేలిక పడిన స్కూల్ బ్యాగ్‌తో హాయిగా పాఠశాలకు వెళ్ల గలుగుతారు. ఉదాహరణకు 3 నుంచి 5 తరగతులకు తెలుగు, ఆంగ్లం కలిపి ఒక టెక్స్ట్ బుక్, గణితం, ఈవీఎస్ కలిపి ఒక టెక్స్ట్ బుక్, ఒక వర్క్ బుక్ కలిపి.. కేవలం మూడు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ తీసుకు వెళితే సరిపోతుంది.

పాఠ్య పుస్తకాల వివరాలు ఇలా...

- 1, 2 తరగతులకు సంబంధించి ఒక సెమిస్టర్‌కి తెలుగు, లెక్కలు, ఇంగ్లీషు కలిపి ఒక పాఠ్య పుస్తకం, ఒక వర్క్ బుక్ ఇచ్చారు.
- 3, 4, 5 క్లాసులకు తెలుగు, ఇంగ్లీషు కలిపి ఒక పాఠ్య పుస్తకం, లెక్కలు, ఈవీఎస్ (పర్యావరణ అధ్యయనం) కలిపి ఒక పాఠ్య పుస్తకంగా చేశారు. దీంతో పాటు ఒక వర్క్ బుక్ ఇచ్చారు.
- 6, 7 తరగతిలో తెలుగు, హిందీ, ఆంగ్లం కలిపి ఒక పాఠ్య పుస్తకంగా చేశారు. లెక్కలు, సైన్స్, సోషల్ పాఠ్య పుస్తకాలు విడివిడిగా ఇచ్చారు.
- 8, 9 తరగతులకు తెలుగు, హిందీ, ఆంగ్లం కలిపి ఒక పాఠ్య పుస్తకంగా, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం కలిపి ఒకటి, లెక్కలు ఒక పాఠ్య పుస్తకం, సోషల్ సైన్స్ (భూగోళ శాస్త్రం, రాజకీయ శాస్త్రం, చరిత్ర, అర్థిక శాస్త్రం) ఒక పాఠ్య పుస్తకంగా ఇచ్చారు. 9వ తరగతికి అదనంగా ఆంగ్ల పదాలు, వ్యక్తీకరణకు సంబంధించి ఒక వర్క్ బుక్ ఇచ్చారు.
- 10వ తరగతిలో తెలుగు, హిందీ, ఆంగ్లం, లెక్కలు, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సోషల్ సైన్స్‌లో చరిత్ర, భూగోళ, రాజకీయ, ఆర్థిక శాస్త్రం పాఠ్య పుస్తకాలు విడివిడిగా ఇచ్చారు. 9, 10 తరగతులకు హిందీలో ఎన్‌సీఆర్‌టీ పాఠ్యాంశాలు తొలగించి స్టేట్ సిలబస్ (ఎస్‌సీఆర్‌టీ) అందుబాటులోకి తెచ్చారు.

ఎన్నాళ్లీ ఇక్కట్లు!

వైసీపీ హయాంలో దారుణంగా తయారైన బీఎన్ రోడ్డు

- కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా మొదలుకాని అభివృద్ధి పనులు
- భారీ గోతుల్లో కూరుకుపోతున్న వాహనాలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న జనం


మేడివాడ వద్ద గోతిలో కూరుకుపోయిన సరుకుల వ్యాన్‌ను బయటకు నెడుతున్న స్థానికులు

రావికమతం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నం- నర్సీపట్నం రోడ్డులో రావికమతం మండల పరిధిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు నానాపాట్లు పడ్డామని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా తమ ఇక్కట్లు తొలగలేదని వాపోతున్నారు. బీఎన్ రోడ్డుపై మండల పరిధిలో పలుచోట్ల భారీ గోతులు ఏర్పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కొద్దిపాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నారు.

కొన్నిచోట్ల రెండు, మూడు అడుగుల లోతు వుండడం, గతంలో మట్టితో గోతులను పూడ్చడంతో కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో గోతులు బురదగా తయారై ఊబిలా మారాయి. దీంతో వాహనాలు కూరుకుపోయి, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నది. శనివారం సాయంత్రం మేడివాడ పాల కేంద్రం వద్ద ఉన్న భారీ గొయ్యిలో కర్రల లోడుతో వస్తున్న ట్రాక్టర్ కూరుకుపోయింది. తరువాత రెండు ట్రాక్టర్ల సహాయంతో గోతిలో నుంచి బయటకు లాగాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం నర్సీపట్నం నుంచి సరుకుల లోడుతో రావికమతం వైపు వస్తున్న వ్యాన్.. మేడివాడ జుత్తాడ కొండమ్మ టిఫిన్ సెంటర్ ఎదురుగా ఉన్న గొయ్యిలో కూరుకుపోయింది. సుమారు గంటపాటు స్థానికులు శ్రమించి బయటకు తీయాల్సి వచ్చింది. ఇటువంటి సంఘటనలు బీఎన్ రోడ్డులో పలుచోట్ల తరచూ జరుగుతున్నాయి. ఈ సమస్య ఎప్పటి తొలగుతుందో తెలియడం లేదని ఈ రోడ్డులో నిత్యం ప్రయాణించే పలు మండలాల ప్రజలు వాపోతున్నారు.

డీసీఎంఎస్‌కు పూర్వ వైభవం

- రైతులకు సేవలు అందించాలి
- హోం మంత్రి అనిత
- సంస్థ చైర్మన్‌గా కోట్ని బాలాజీ ప్రమాణస్వీకారం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత. వేదికపై ఎంపీ, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు


డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న కోట్ని బాలాజీ

అనకాపల్లి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)కి పూర్వ వైభవం తీసుకు వస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్థానిక రింగు రోడ్డులోని ఒక కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కూటమి నేతల సమక్షంలో డీసీఎంఎస్ చైర్మన్‌గా కోట్ని బాలాజీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి అనిత మాట్లాడుతూ, డీసీఎంఎస్ చైర్మన్ పదవిని ఒక బాధ్యతగా భావించి రైతులకు సేవలందించాలని బాలాజీకి సూచించారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని అనడానికి డీసీఎంఎస్ చైర్మన్ పదవి బాలాజీకి దక్కడమే నిదర్శనమని అన్నారు. డీసీఎంఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, డీసీఎంఎస్ ద్వారా సూపర్ బజార్ ఏర్పాటు చేయాలని సూచించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, డీసీఎంఎస్ ద్వారా గతంలో పలు వ్యాపారాలు జరిగేవని, వాటిని తిరిగి చేపట్టాలని అన్నారు. డీసీఎంఎస్ నూతన చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖపట్నం డీసీఎంఎస్‌ను ఉత్తమ సంస్థగా తీర్చిదిద్దుతామన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంస్థ అభివృద్ధే లక్ష్యంగా శక్తివంచన లేకుండా చేస్తానన్నారు. అనంతరం బాలాజీని మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు సత్కరించి అభినందించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్ ... మిగతా 6వ పేజీలో

ఎలమంచిలి ఆర్‌అండ్‌బీ అతిథిగృహం రూ.3 కోట్లతో అభివృద్ధి

- రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ 'ప్రగడ'


ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహానికి మహర్దశ పట్టనున్నది. ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను రూ.3 కోట్లతో ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆదివారం ఇక్కడ మీడియాకు వెల్లడించారు. ఆధునికీకరణ పనులకు సంబంధించి అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారని ఆయన చెప్పారు.

జనవరి 28న టీ20 మ్యాచ్

- ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య నిర్వహణ



విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లకు రంగం సిద్ధమవుతోంది. త్వరలో జరగనున్న వుమెన్ వరల్డ్ కప్ టోర్నీకి ఆతిథ్యమిచ్చేందుకు సమాయత్తమవుతున్న విశాఖ... వచ్చే ఏడాది ప్రారంభంలో కూడా మరో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ లభించింది. జనవరి 28న భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌కు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం కానున్నది. న్యూజిలాండ్ జట్టు భారత్ పర్యటనలో భాగంగా భారత్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లు ఆడనున్నది. ఇందుకు సంబంధించిన మ్యాచ్‌ల తేదీలు, వేదికల షెడ్యూల్‌ను భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఆదివారం ప్రకటించింది. ఐదు టీ20 సిరీస్‌కు సంబంధించి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు (ఏసీఏ) ఒక మ్యాచ్‌ను కేటాయిస్తూ షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య జనవరి 28న జరగనున్న నాలుగో టీ20 మ్యాచ్‌కు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదిక కానున్నది. దీంతో ఇప్పటి వరకు మూడు టెస్టు మ్యాచ్‌లు, పది వన్డే మ్యాచ్‌లు, నాలుగు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన విశాఖ... త్వరలో ఐదో టీ20 మ్యాచ్ నిర్వహణకు సిద్ధమవుతోంది.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- సప్లిమెంటరీ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపం

అనకాపల్లి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో అనుకున్న మార్కులు రాకపోవడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొన్నది. పట్టణంలో ఆదివారం జరిగిన ... మిగతా 6వ పేజీలో

కాళ్ల పారాణి ఆరకముందే...

రోడ్డు ప్రమాదంలో నవ దంపతుల మృతి

- భార్యది గంగవరం, భర్తది కాకినాడ జిల్లా పిఠాపురం
- గత నెల 9న వివాహం



సాయి, శాలినిల పెళ్లి నాటి ఫొటో. (ఇన్‌సెట్‌లో) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయి

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పారాణి ఆరకముందే.. మామిడి తోరణాలు వాడకముందే.. పెళ్లి నాటి సందడిని మరవకముందే ఆ నవ దంపతులు కానరాని లోకాలకు తరలిపోయారు'. ప్రేమించుకుని పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్న నెల రోజులకే వారిద్దరూ ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విశాఖలోని గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి మారుతి జంక్షన్ వద్ద చోటుచేసుకున్న ఈ విషాద సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతానికి చెందిన జొన్నాడ సాయి (27), విశాఖలోని గంగవరం ప్రాంతానికి చెందిన ఎరిపిల్లి శాలిని (25) గాజువాకలోని బెస్ట్ విజన్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ ప్రేమించుకోవడంతో పాటు పెద్దలను ఒప్పించి పిఠాపురంలో గత నెల 9న వివాహం చేసుకున్నారు. అనంతరం బంధువులకు గాజువాక ప్రాంతంలో విందు కూడా ... మిగతా 6వ పేజీలో

రైలు నుంచి జారిపడి మహిళ మృతి


ముత్యాలమ్మ (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం వద్ద రైలు నుంచి జారిపడి ఒక మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు అందజేసిన వివరాలిలా వున్నాయి. కాకినాడ జిల్లా తునికి చెందిన గండి ముత్యాలమ్మ(53) దువ్వాడ వెళ్లేందుకు ఆదివారం ఉదయం తుని స్టేషన్‌లో కాకినాడ- విశాఖపట్నం పాసింజర్ రైలు ఎక్కింది. కొద్దిసేపటి తరువాత వాంతులు అవుతున్నాయంటూ డోర్ దగ్గరకు వెళ్లి నిల్చుంది. రైలు సీతారాంపురం వద్దకు వచ్చే సరికి వాంతులు చేసుకుంటూ ప్రమాదవశాత్తూ బయటకు పడిపోయింది. ఆమెతో ప్రయాణిస్తున్న మనవడు గౌతమ్ చరణ్ పెద్దగా కేకలు వేయడంతో బోగీలో వున్న ఇతర ప్రయాణికులు వెంటనే చైన్ లాగారు. రైలు ఆగిన తరువాత సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ముత్యాలమ్మ అప్పటికే మృతిచెందింది. చరణ్ తుని రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ రైల్వే పోలీస్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది అక్కడకు వెళ్లి పరిశీలించారు. మృతదేహానికి తుని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గౌతమ్‌చరణ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కొక్కిరాపల్లి బ్రిడ్జికి కొంగొత్త అందాలు

- గత ఏడాది ఆదరాబాదరాగా ప్రారంభించిన వైసీపీ పాలకులు
- కనీసం రంగులు కూడా వేయకపోవడంతో పలువురు ఆశ్చర్యం
- కూటమి నేతల ఒత్తిడి మేరకు కొత్తరూపుతో అంతా ఆనందం


ఇరువైపులా టైల్స్ అమర్చి, రంగులు వేయడంతో ఆకట్టుకుంటున్న బ్రిడ్జి

ఎలమంచిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొక్కిరాపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కొంగొత్త అందాలను సంతరించుకుంది. గత ఏడాది ఎన్నికలు సమీస్తున్నాయని భావించిన వైసీపీ పాలకులు ఆదరా బాదరాగా ఈ బ్రిడ్జిని ప్రారంభోత్సవం చేసేశారు. ఆ సమయంలో కనీసం రంగులు కూడా వేయలేదు. దీంతో బ్రిడ్జిని చూసేవారు ఇది కొత్తగా ప్రారంభించిందేనా.. అనే సందేహాన్ని వ్యక్తం చేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక సదరు నాయకుల ఒత్తిడి మేరకు సదరు కాంట్రాక్టర్ ఇటీవల బ్రిడ్జికి ఇరువైపులా టైల్స్ ఏర్పాటు చేయడంతో పాటు రంగులు వేయించడంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2009 సంవత్సరంలో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో ఈ బ్రిడ్జి నిర్మించేందుకు అప్పటి మంత్రి కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఆ తరువాత చాలా కాలం బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టలేదు. అనంతరం టీడీపీ అధికారంలోకి రావడంతో కొంతమేర పనులు జరిగాయి. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మరికొంత శాతం పనులు చేయించారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని గుర్తించిన సదరు పాలకులు గత ఏడాది బ్రిడ్జిని హడావుడిగా ప్రారంభించేశారు. కనీసం అప్పట్లో రంగులు కూడా వేయించలేదు. ఇది గుర్తించిన కూటమి నాయకులు ఒత్తిడి చేయడంతో బ్రిడ్జికి ఇరువైపులా టైల్స్ ఏర్పాటు చేయడంతో పాటు రంగులు వేయించి అందంగా తీర్చిదిద్దారు. దీంతో బ్రిడ్జిపై ప్రయాణించేవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సింహాచలం దేవస్థానంలో ఏఈఓల బదిలీ

సింహాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానంలో పలువురు ఏఈఓలను బదిలీ చేస్తూ ఈఓ వేంద్ర త్రినాథరావు ఉత్తర్వులు జారీ చేశారు. 20 రోజుల క్రితం ఆలయ ఏఈఓగా ఉన్న ఎన్. ఆనందకుమార్‌ను అన్నప్రసాద విభాగానికి, అన్నప్రసాద విభాగంలో పనిచేస్తున్న ఏఈఓ పిల్లా శ్రీనివాసరావును అప్పన్న ఆలయ ఏఈఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. నెల కూడా గడవక ముందే రెండు రోజుల క్రితం మరోసారి ఏఈఓల బదిలీలకు ఈఓ ఆదేశాలివ్వడం చర్చనీయాంగా మారింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ప్రస్తుతం డిప్యూటీ ఈఓగా పనిచేస్తున్న సింగం రాధను దేవాలయ ఏఈఓగా నియమించారు. గత కొన్నేళ్లుగా దేవస్థానం న్యాయ విభాగంలో పనిచేస్తున్న ఏఈఓ విబి రమణమూర్తిని అక్కడి నుంచి తప్పించారు. రమణమూర్తికి ఆగమ పాఠశాల, నృసింహవనం నిర్వహణ విధులు కేటాయించారు. ప్రస్తుతం అకౌంట్స్, లీగల్ ప్రత్యుత్తరాలు విభాగాలను చూస్తున్న నరసింహరాజును వాటి నుంచి తప్పించి భూముల పరిరక్షణ, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, ఆర్‌టీఐ విభాగాలకు బదిలీ చేశారు. ఆలయ ఏఈఓగా పనిచేస్తున్న పిళ్లా శ్రీనివాసరావును భైరవస్వామి ఆలయం, నిద్దాం భూములు, ఆడిట్, అప్పన్న పూదోట పరిరక్షణతో పాటు 275 సర్వే నంబర్‌లోని భూముల పరిరక్షణ విభాగాలకు కేటాయించారు. అన్నప్రసాద విభాగం ఏఈఓగా ఉన్న ఎన్ ఆనంద కుమార్‌కు ప్రజా సంబంధాల విభాగాన్ని అదనంగా అప్పగించారు. 20 రోజుల వ్యవధిలో ఏఈఓల మార్పులు ఎం దుకు అన్న దానిపై దేవస్థానం ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

యోగా డే విజయవంతం కావాలి

- 21న విశాఖలో జరగనున్న వేడుకకు ప్రధాని మోదీ హాజరు
- భారీ ఏర్పాట్లు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రజలంతా హాజరయ్యేలా కృషి చేయాలి
- కూటమి ముఖ్య నేతలకు సుందరపు, బత్తుల, ప్రగడ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు, వేదికపై నాగేశ్వరరావు, తాతయ్యబాబు

ఎలమంచిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న విశాఖలో జరగనున్న వేడుకలను అంతా విజయవంతం చేయాలని కూటమి నేతలు పిలుపునిచ్చారు. పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటైన కూటమి ముఖ్య నేతల సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్ తదితరులు ఇక్కడ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. యోగా ఆవశ్యకతను తెలియజేసేందుకు ఇప్పటికే అన్ని ప్రభుత్వ శాఖలతో పాటు ఊరూరా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యోగా దినోత్సవం విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. అనంతరం పలు సూచనలు చేశారు.

మత్స్యకారుల వలలకు అభిలాష చేపలు

అచ్యుతాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వేట నిషేధం అనంతరం సముద్రంపైకి వెళ్లిన మత్స్యకారుల వలలకు అభిలాష (అపోలో ఫిష్) చిక్కాయి. రెండు నెలల సుదీర్ఘ విరామం అనంతరం శనివారం అర్ధరాత్రి దాటాక వేట ప్రారంభమైంది. కొందరు మత్స్యకారులు పూడిమడక తీరం నుంచి వేటకు బయల్దేరారు. వాతావరణంలో మార్పుల కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో కొద్ది మంది మాత్రమే వేట సాగించారు. వీరి వలల్లో అభిలాష చేపలు పడ్డాయి. ఒడ్డుకు చేర్చ డంతో వ్యాపారులు కేజీ రూ.250 చొప్పున కొనుగోలు చేశారు.




అభిలాష చేపలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ప్రమాదకరంగా కృష్ణంరాజు కాలువపై బ్రిడ్జి!

మునగపాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాక కృష్ణంరాజు కాలువపై ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. మెయిన్ రోడ్డు రిక్షా స్టాండ్ నుంచి గ్రామంలో ప్రవేశించాలంటే ఈ బ్రిడ్జి మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. చిన్న చిన్న వాహనాలు ఇటుగానే నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటువంటి ప్రధాన బ్రిడ్జి అడుగు భాగం మొత్తం పెచ్చులూడి ప్రమాదం అంచునకు చేరింది. అంతా పైభాగంలో శిథిలమై ఉన్న రక్షణ గోడలనే చూస్తున్నారు తప్ప, అడుగు భాగంలో పొంచి ఉన్న ప్రమాదాన్ని మాత్రం గుర్తించ లేకపోతున్నారు. కొద్దిరోజులుగా మునగపాక పరిధి కృష్ణంరాజు సాగునీటి కాలువలో జేసీబీ ద్వారా తుప్పలు, మట్టిదిబ్బలు, వ్యర్థాల తొలగింపు పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఓ వ్యక్తి బ్రిడ్జి కింద భాగాన్ని ఆదివారం చూసి నివ్వెరా పోయారు. బ్రిడ్జి అడుగు బాగానికి సంబంధించిన దృశ్యాలను చూసి పలువురు ఆందోళన చెందుతున్నారు. బ్రిడ్జి అడుగు భాగం మొత్తం పెచ్చులు ఊడిఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



మునగపాకలోకి ప్రవేశ బ్రిడ్జి (అంతర్ చిత్రం) కింది భాగం దృశ్యం

సప్పర్ల రెయిన్‌గేజ్ వద్ద రోడ్డుపైకి అడవి గేదె

- బస్సు డ్రైవర్ హారన్‌తో రోడ్డు పక్కనే పొదల్లోకి..


శనివారం రాత్రి రహదారి పక్కన పొదల్లో అడవిగేదె

సీలేరు, జూన్ 15, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మం డలం సప్పర్ల రేయిన్‌గేజ్ వద్ద శనివారం రాత్రి పాడేరు నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు అడ్డంగా అడవి గేదె వచ్చింది. ఒక్కసారిగా రహదారి మధ్యలో ఈ గేదె ఉండటాన్ని గమనించిన డ్రైవర్ తొలుత భయాందోళనకు గురయ్యాడు. అనం తరం గట్టిగా హారన్ కొట్టే సరికి ఆ అడవి గేదే నెమ్మదిగా రోడ్డు పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లి నిలబడింది. ఇది గమనించిన బస్సులోని ప్రయాణికులు ఈ అడవిగేదేను తమ సెల్ ఫోనుల్లో బంధించారు. గతంలో కూడా ఇదే సప్పర్ల రేయిన్ గేజ్ సమీపంలోనే డొంకరాయి నుంచి పాడేరు వె ళ్తున్న బస్సు చిరుతపులి కనిపించింది.

లభించని గల్లంతైన పర్యాటకుని ఆచూకీ


డుడుమ జలపాతంలో గాలింపులు చేపడుతున్న సహాయక బృందాలు

ముంచంగిపుట్టు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏవోబీ)లో గల డుడుమ జలపాతంలో గల్లంతైన పర్యాటకుడు అనిమెష్‌దాస్(27) ఆచూకీ ఆదివారం సైతం కానరాలేదు. కోల్‌కతాకు చెందిన అనిమెష్‌దాస్ కుటుంబ సభ్యులతో కలసి శనివారం డుడుమ జలపాతాలను చూసేందుకు వచ్చి ప్ర మాదవశాత్తు జలపాత ప్రవాహంలో మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. ఒడిశా లంతాపుట్టుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది, కొరాపుట్టుకు చెందిన(ఓడీఆర్ఎఫ్) సహాయక బృందాలు గత రెండు రోజులుగా జలపాతంలో విస్తృత గాలింపులు చేపడుతున్నారు. అయినా, గల్లంతైన పర్యాటకుడు ఆచూకీ కానరాలేదు. మరో మారు సోమవారం ఉదయం నుంచి గాలింపులు చేపడతామని సహాయక బృందాలు తెలిపారు.

వలస పక్షులు

... 5వ పేజీ తరువాయి

గత ఏడాది ఎన్నికల ముందే జనసేనలో చేరారు.

ఎన్నికల తరువాత అచ్యుతాపురం మండలంలో వలసలు

గత ఏడాది ఎన్నికల తరువాత దోసూరు ఎంపీటీసీ సభ్యురాలు రాజాన పద్మజ (అప్పారావు), మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఉప్పవరం సర్పంచ్ సకల ఉమామహేశ్వరి, ఆవరాజాం ఉప సర్పంచ్ పిల్లి సత్తిబాబు జనసేనలో చేరారు. మరో ఆరుగురు వైసీపీ సర్పంచులు, ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు జనసేనలో చేరడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

మునగపాక మండలంలో..

రాజుపేట సర్పంచ్ కిల్లాడ దేముళ్లు, గంటవానిపాలెం సర్పంచ్ కోన వెంకటలక్ష్మి, మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, చెర్లోపాలెం ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి, నాగులాపల్లి-1 ఎంపీటీసీ సభ్యురాలు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి జనసేనలో చేరారు. ఉమ్మలాడ సర్పంచ్ సూరిశెట్టి గంగయ్యమ్మ భారతీయ జనతా పార్టీలో చేరారు.

ఎలమంచిలి మండలంలో..

ఎలమంచిలి మండలం రేగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్ ఎంపీపీ రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు, పురుషోత్తపురం సర్పంచ్ అయిన ఆయన భార్య రాజాన సునీత, ఎలమంచిలి వైస్ ఎంపీపీ, జంపపాలెం ఎంపీటీసీ సభ్యురాలు శిలపరశెట్టి ఉమ జనసేన పార్టీలో చేరారు.

రాంబిల్లి మండలంలో...

దిమిలి సర్పంచ్ బంగారు చిలుకు, కొత్తూరు సర్పంచ్ నానేపల్లి లక్ష్మి, కృష్ణంపాలెం సర్పంచ్ పైల సత్తిబాబు, కట్టుబోలు ఎంపీటీసీ సభ్యుడు జనపరెడ్డి చిన్న, మురకాడ ఎంపీటీసీ సభ్యుడు అమలుకంటి తాతాజీ, రజాల సర్పంచ్ పొన్నాడ లక్ష్మి.

డీసీఎంఎస్‌కు పూర్వ వైభవం

... 5వ పేజీ తరువాయి

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, కూటమి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, మాదంశెట్టి నీలబాబు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పోల్నాటి అప్పారావు, డీసీఎంఎస్ బీఎం సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కోట్ని బాలాజీ స్వగ్రామమైన అనకాపల్లి మండలం బవులవాడ నుంచి నెహ్రూచౌక్, మెయిన్‌రోడ్డు, రింగు రోడ్డు మీదుగా ఫంక్షన్ హాలు వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. బాలాజీని గజమాలతో సత్కరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

ఈ సంఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రింగురోడ్డులోని ఒక అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న జంపా ప్రేమ్‌చంద్ కుమార్తె మహిమాచంద్ (17) ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదివింది. మార్చిలో జరిగిన పరీక్షల్లో మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యింది. దీంతో గత నెలలో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షలు రాసింది. ఇటీవల విడుదల అయిన ఫలితాల్లో ఆమె పాసైంది. కానీ అనుకున్న మార్కులు రాలేదని మనస్తాపం చెందింది. ఆదివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్నకు యత్నించింది. కుటుంబ సభ్యులు గమనించి కిందకు దించారు. చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. మృతురాలి తండ్రి ప్రేమ్‌చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కాళ్ల పారాణి ఆరకముందే...

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. ప్రస్తుతం దంపతులిద్దరూ గాజువాకలోనే నివాసం ఉంటున్నారు. శనివారం సాయి పుట్టినరోజు కావడంతో సెలవు లేని కారణంగా ల్యాబ్‌లోనే ఉండిపోయారు. ఆదివారం నగరంలోని ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు ములగాడ రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో మారుతి జంక్షన్ వద్ద ఓ ట్రాలర్ వెనుక నుంచి వీరి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో వారిద్దరూ రోడ్డుపై తుళ్లిపడ్డారు. దీంతో సాయి అక్కడికక్కడే మృతిచెందగా, శాలిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన ట్రాలర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యాలయంలో యోగాంధ్ర శిక్షణ


యోగాసనాలు వేస్తున్న కూటమి నాయకులు

పాయకరావుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన యోగాంధ్ర శిక్షణ తరగతుల్లో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. యోగా గురువు వీరభద్రరావు ఆధ్వర్యంలో శిక్షణ తరగతుల్లో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షులు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారా యణరావు, బొంది కాశీవిశ్వనాథ్, జూరెడ్డి ప్రసాద్, పెంకే గోవిందు, గొల్లపల్లి నాగు, కంభంపాటి వెంకటరమణ, మలిపెద్ది సతీష్, చిరుకూరి పేర్రాజు, రాజాన ఆది తదితరులు పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయానికి సీసీ కెమెరాల వితరణ


సీసీ కెమెరాల కిట్‌ను ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజుకు అందజేస్తున్న దాత

నక్కపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయానికి ఎస్.రాయవరం మండలం గోకులపాడుకు చెందిన జనసేన నాయకుడు మత్తి కార్తీక్ నాలుగు సీసీ కెమెరాలను ఆదివారం ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజుకు అందజేశారు. ఇటీవల ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా, ఆలయ భద్రత కోసం సుమారు రూ. 28వేల విలువైన నాలుగు సీసీ కెమెరాలను, అందుకు తగ్గ సాంకేతిక పరికరాలను వితరణగా అందజేశారు. ఆలయ ధర్మకర్త కార్తీక్‌ను అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. కార్యక్రమంలో శానాపతి అప్పారావు, విజయ్‌కుమార్, ఎస్ఎస్ఎఫ్ జిల్లా మహిళా ధర్మ ప్రచారక్ కె.లలిత, గోకులపాడు జనసేన నాయకులు నక్కా శ్రీనివాస్, గొర్లె సురేశ్, ప్రగడ దుర్గా ప్రసాద్, పిల్లి నగేశ్, మాలెం రమణబాబు, ధనబాబు, ఎ.రవి పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ


విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : చదువులో ప్రతిభ చూపుతున్న మండలంలో అరట్లకోట గ్రామానికి చెందిన బొడ్డపాటి నళినికి మండలంలో పాల్మన్‌పేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మైలపల్లి అశోక్‌చక్రవర్తి, స్ఫూర్తి ఫౌండేషన్ అధినేత నేమాల శ్రీనివాసరావు సంయుక్తంగా రూ. 30 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ని ఆదివారం అందజేశారు. ఆమె చదువులో మరింతగా రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేమాల నాగమణి, స్ఫూర్తి నైనిత, గంగాధర్, ముత్తి మురళి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో వైసీపీ శ్రేణులు చేరిక


రాజగోపాలపురం సర్పంచ్, వైసీపీ కార్యకర్తలను జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పాయకరావుపేట రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజగోపాలపురం గ్రామ సర్పంచ్ యన్నంరెడ్డి లోవరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పలువురు ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సమక్షంలో జనసేన పార్టీలో చే రారు. పెందుర్తి పార్టీ కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు పార్టీ కండువాలువేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న గెడ్డం బుజ్జిని అభినందించారు. లోవరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు ఆకర్షితులపై జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు. నీలాపు నాగిరెడ్డి, యన్నంరెడ్డి మాధవరెడ్డి, నెహ్రూరెడ్డి, మంగి మహారాజరెడ్డి, దలాయి రామచంద్రారెడ్డి, నీలాపు వెంకటరమణరెడ్డి, కుప్పిలి భాస్కరరెడ్డి, దొండపాటి సూరిబాబు, తదితరులు జనసేన పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పాయకరావుపేట, నక్కపల్లి మండలాల జనసేన అధ్యక్షులు యగదాసు నానాజీ, వెలగా సుధాకర్, జనసేన నాయకులు జగన్నదొర, నల్లల రత్నాజీ, తుమ్మల గణేశ్, సఖినేపల్లి సతీశ్, కోడా సురేశ్‌కుమార్, గరికిన కొండబాబు చొక్కా రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. రాజగోపాలపురం సర్పంచ్ లోవరెడ్డి, కందిపూడికి చెందిన వైసీపీ కార్యకర్తలు పలువురు జనసేనలో చేరడంతో ఈ రెండు గ్రామాలలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలినట్లయింది. లోవరెడ్డి గతంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులుగా పదవులు నిర్వహించారు. ఇంతరకు రాజగోపాలపురం,కందిపూడి వైసీపీకి కంచుకోటగా ఉన్నాయి.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం


మంగవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం గ్రామంలో ఆదివారం వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ ఆధ్వర్యంలో మహిళలకు గర్భాశయ, రొమ్ము పరీక్షలపై మహిళా ఉచిత అవగాహన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గణసాల రామన్న జ్ఞాపకార్థం వారి కుమారులు నూకరాజు, వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారం అందించారు. తుని మమత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రముఖ ప్రసూతి వైద్యులు పుష్ప రమావాణి సుమారు 50 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వికాస తరంగిణి జిల్లా కోఆర్డినేటర్ కట్టా వీరబాబు తెలిపారు. ఈ సందర్భంగా రమావాణి మహిళలకు గర్భాశయ, రొమ్ము క్యా న్సర్‌పై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మంగవరం కాలువ నీటిసంఘం అధ్యక్షులు గూటూరు రామగోవిందు, టీడీపీ నాయకులు దేవవరపు ఆనంద్, కోనే కొండబాబు, గణసాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

పాయకరరావుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి):పాయకరావుపేటకు చెందిన వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు సంబంధించి తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు వివరాలివి.. తుని రైల్వే స్టేషన్ దాటిన తరువాత పెద్దగేటు సమీపంలో శనివారం రైలు ఢీకొని మృతిచెందిన వృద్ధుడి మృతదేహంగుర్తించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా మృతుడు పాయకరావుపేటకు చెందిన అయినవిల్లి నాగరాజు (80)గా గుర్తించారు. మృతుడు పాయకరావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ క్లర్కుగా పనిచేసి 22 ఏళ్ల క్రితం పదవీ విరమణచేయగా, మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య ఐదేళ్ల కిందట మృతి చెందారు. నాగరాజు గత తొమ్మిదేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో నొప్పితాళలేక శనివారం ఉదయం బయటకు వెళ్లిన అతను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యుల ద్వారా తెలి సింద న్నారు.తుని ఏరియా ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రపంచ రికార్డు దిశగా విశాఖలో యోగాంధ్ర


మాట్లాడుతున్న శివదత్

నక్కపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న విశాఖ కేంద్రంగా జరగనున్న యోగాం ధ్ర -2025 సరికొత్త ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంటుందని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బోడపాటి శివదత్ చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి జనసేన పార్టీ తరఫున గాజువాక అసెంబ్లీ కో -ఆర్డినేటర్‌గా నియమితులైన శివదత్ ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. దేశ వారసత్వ సంపదయిన యోగాకు పూర్వవైభవం కోసం ఏటా జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించేలా చేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. జూన్ 21న విశాఖ కేంద్రంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో 5 లక్షల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వాలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయని చెప్పారు. ఆయన వెంట జనసేన నాయకులు ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, పాము గణేశ్, యలమంచిలి చంద్రరావు, పిక్కిస్వామి,బంగారి రాజుతదితరులున్నారు.

జాతర ముగిసినా జనమే

- భక్తుల కోలాహలంతో నూకాంబిక ఆలయం సందడి
- బాలాలయంలో విశేష పూజల అనంతరం దర్శనాలు


బాలాలయంలోని అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. కొత్త అమావాస్య జాతర ముగిసి సుమారు రెండు నెలలు కావస్తున్నా తాకిడి తగ్గలేదు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి రావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. తెల్లవారుజామున అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి విశేష అంకరణలు, పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కుటుంబాలతో విచ్చేసినవారు ఆలయం ఆవరణతో పాటు చుట్టుపక్కల తోటల్లో వంటలు వండుకుని నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఆరగించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది చర్యలు చేపట్టారు. పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించగా, ట్రాఫిక్ సమస్య తలెత్త కుండా సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.


అమ్మవారిని దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

బడిలో భయం.. భయం..

- శిథిలావస్థలో ఊటగెడ్డపాలెం ఎంపీపీ పాఠశాల భవనం
- బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్న విద్యార్థులు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన


శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం


వరండాలోనే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయిని

పరవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి ఊటగెడ్డపాలెంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం దీని నిర్మాణం చేపట్టారు. గత రెండు మూడేళ్లుగా భవనం పరిస్థితి రోజు రోజుకు అధ్వానంగా తయారవుతోంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 17 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ఒక్క టీచర్ బోధన చేస్తున్నారు. భవనం శిథిల స్థితికి చేరడంతో విద్యార్థులతో పాటు టీచర్ బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

పెచ్చులూడి పడుతున్న శ్లాబ్

తరగతి గదిలోపల శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో విద్యార్థులను వరండాలోనే కూర్చోబెట్టి పాఠాలను బోధిస్తున్నారు. భవనం సన్‌షేడ్ పూర్తిగా ధ్వంసమైంది. కిటికీలు, తలుపులు చెదలు పట్టాయి. గచ్చులు పాడైపోయాయి. ఇన్ని అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. తలుపులు సక్రమంగా లేకపోవడం వల్ల లోపల గల సామగ్రి దొంగల పాలయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

వర్షం కురిస్తే నీరంతా లోపలికే..

వర్షాల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. శ్లాబ్ కారిపోతుండడంతో లోపల ఉన్న రికార్డులు తడిసి ముద్దవుతున్నాయి. విద్యా బోధన కూడా సక్రమంగా కొనసాగలేని దుస్థితి దాపరించింది. పాఠశాల భవనం శిథిలవస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అసౌకర్యాల నడుమ జరగడంతో విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేక పోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు- నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పడంతో ఎంతో ఆనందించామని, కానీ తమ గ్రామంలో పాఠశాల దుస్థితి మాత్రం మారలేదని పలువురు గ్రామస్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.


చెద పట్టిన కిటికీ

పట్టించుకోని అధికారులు

పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులెవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతు న్నారు. విద్యార్థులు వసతి లేమితో ఇబ్బందులు పడుతూ భయం.. భయంగా.. చదువులు సాగిస్తున్నా గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు గానీ, ప్రస్తుత పాలకులు గానీ దృష్టి సారించడం లేదని అంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

పాఠశాల భవనం పరిస్థితిని జిల్లా ఉన్నతాధికారులతో పాటు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా పంపించాం. త్వరలోనే నిధులు మంజూరు చేయించి, భవనానికి మరమ్మతులు చేపడతాం.

- ఎం.దివాకరరావు,
ఎంఈవో, పరవాడ

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి : కొణతాల


వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమవరం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులంతా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం


పైడివాడ అగ్రహారంలో గ్రంథాలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

సబ్బవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంతో పాటు పైడివాడ అగ్రహారంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. విశాఖకు చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి గ్రంథాల ప్రతులను పంచిపెట్టారు. ఈ సందర్భంగా జ్ఞాన వేదిక సభ్యులు మాట్లాడుతూ శ్రీకృష్ణుడ్ని మాత్రమే ఎందుకు జగద్గురువుగా పూజించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన వేదిక సభ్యులు శ్రీనివాస్, దేవి, లక్ష్మి, నాగమణి, పద్మ, మహాలక్ష్మి, అప్పలనాయుడు, అప్పారావు, మంగ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్యం అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

అనకాపల్లి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అధికార దుర్వినియోగం సామాజిక న్యాయానికి అడ్డుగోడగా నిలుస్తుందని విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. ఇక్కడి గౌరీ గ్రంథాలయంలో గ్రీన్‌క్లబ్ పదకొండవ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. అవినీతి, అధికార దుర్వినియోగం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్యం, విషయ పరిజ్ఞానం అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, కాండ్రేగుల సత్యనారాయణ, పెంటకోట ఉమామహేశ్వరరావు, బీరా వినోద్‌కుమార్, అనిత, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'బండారు'ను కలిసిన శాప్ డైరెక్టర్ రాజు


డైరెక్టర్ రాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

సబ్బవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) బోర్డు డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన అనకాపల్లి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పీబీవీఎస్‌ఎన్ రాజు ఆదివారం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని పరవాడ మండలం వెన్నలపాలెంలో గల తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బండారు అతనికి శాలువా కప్పి సత్కరించారు. క్రీడల్లో యువతను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండి దేముడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీను, టీఎన్‌టీయూసీ అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు రొంగలి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

ఆరోగ్యానికి యోగా చక్కటి మార్గం

- అవగాహన కార్యక్రమాల్లో వక్తలు


యోగాసనాలు వేస్తున్న డీపీఆర్‌వో రమణ తదితరులు


అనకాపల్లిలో యోగాపై అవగాహన ర్యాలీ


సబ్బవరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో...

అనకాపల్లి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యానికి యోగా ఒక్కటే సరైన మార్గమని పతంజలి యోగా సమితి భారత స్వాభిమాన్ ట్రస్టు జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు అన్నారు. యోగాపై పట్టణవాసులకు అవగాహన కల్పించేందుకు ఆదివారం ఇక్కడ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల 21న విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా గురువులు మంగియ్య, బి.నరసింగరావు, మాదేటి జనార్దన్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా శ్రమించే శక్తి ప్రతి ఒక్కరిలోనూ క్షీణించిపోతుందని, దానిని పెంపొందించుకునేందుకు ప్రతి రోజూ యోగా సాధన అవసరమన్నారు. తొలుత ఈ ర్యాలీని జార్జిక్లబ్ అధ్యక్షుడు బీఎస్‌ఎంకే జోగినాయుడు, కార్యదర్శి బుద్ద కాశీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొణతాల నరసింహారావు, కోలపర్తి కన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, ఆళ్ల సూర్యరామకృష్ణ, రోహిణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి కలెక్టరేట్ : యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి ఎస్.వి.రమణ అన్నారు. ఇక్కడి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నిత్య జీవితంలో భాగం కావాలన్నారు. అనంతరం యోగాసనాలు వేశారు. ఏషియన్ బ్రౌంజ్ మెడలిస్ట్ బాక్సర్ కుసుమ, యోగా గురువులు మంగియ్య, జ్యోతి, లక్ష్మితో పాటు సహాయ సమాచార ఇంజనీర్ బాలాజీ, జూనియర్ సహాయకులు పీఎస్‌ఎన్ మూర్తి, సమాచారశాఖ సిబ్బంది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

సబ్బవరం : యోగా భారతీయుల వారసత్వ సంపద అని, దానిని అంతా కాపాడుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ సిబ్బంది, సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులతో కలిసి ఆదివారం ఆయన యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారత దేశమన్నారు. దీనికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది మాత్రం ప్రధాని మోదీ అని కొనియాడారు. యోగా సాధన గ్రామ గ్రామాన జరగాలన్నదే ప్రభుత్వ ధ్యేయంగా చెప్పారు. ఆర్‌ఐ వీరయ్య, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వీఆర్వో నూకరత్నం, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పల్ల తాతారావు పాల్గొన్నారు.

ప్రజల దృష్టికి ప్రభుత్వ వైఫల్యాలు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అమర్‌నాథ్, తదితరులు

అనకాపల్లి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజల దృష్టికి తీసుకు వెళతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఇక్కడి రింగు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అప్పులు తీసుకురావడం తప్ప, ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఏడాది పాలనలో చోటు చేసుకున్న అరాచకాలను పుస్తక రూపంలో ప్రజలకు వివరించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, అదీప్‌రాజు, పెట్ల ఉమాశంకర్ గణేశ్, కంబాల జోగులు, జడ్పీ వైస్ చైర్ పర్సన్ బీవీ సత్యవతి, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'జీవిత బీమా ఏజెంట్లకు వ్యతిరేకంగా బీమా సుగమ్ తేవడం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు నాగరాజు

కొత్తూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జీవిత బీమా ఏజెంట్లకు వ్యతిరేకంగా 'బీమా సుగమ్' ను తేవడం సరికాదని ఎల్‌ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. అనకాపల్లి పట్టణంలోని ప్రైవేటు హాలులో ఆదివారం విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల ఏజెంట్లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఏజెంట్లు భారీ స్థాయిలో హాజరు కావడం సంతోషకరమన్నారు. జూలై తొమ్మిదో తేదీన సీఐటీయూ అఖిల భారతమహా సభలు జరగనున్నాయని, విజయవంతం చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఎస్.ఆర్.ఠాగూర్ మాట్లాడుతూ క్లా బ్యాక్ అంశంపై ఏజెంట్లు నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పాలసీదారులకు బోనస్ రేట్లు పెంచాలని, వారు కడుతున్న ప్రీమియంపై విధిస్తున్న జీఎస్‌టీని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రతినిధులు రామకృష్ణ, త్రిమూర్తులు, అప్పాజీ, నారాయణరావు, మోహన్, ఆర్.ఎస్.నాయుడు, పెంటకోట సైదునాయుడు, కరణం మాణిక్యాలరావు, రొంగలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై వృద్ధులకు అవగాహన

కొత్తూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామంలో గల హృదయ శాంతి వృద్ధాశ్రమంలో వయో వృద్ధులకు చట్టాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి ఎ.రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వృద్ధులకు ఉన్న చట్టాలను వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలో న్యాయ విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి రమేశ్


వాహనదారుడితో మాట్లాడుతున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

వాహనదారులకు జరిమానా

కశింకోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం కూడలి వద్ద ఆదివారం సాయంత్రం ఎస్ఐ మనోజ్‌కుమార్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించని వారు, కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు ధరించని వారికి జరిమానాలు విధించారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున పదిహేను మందికి పదిహేను వేల రూపాయలు జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాల్సిందిగా ఆయన సూచించారు.

సీఎం సమావేశాన్ని విజయవంతం చేయండి


గండి బాబ్జీ

సబ్బవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖలోని పోతినమల్లయ్య పాలెం (విశాఖ కన్వెన్షన్ హాలు)లో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫడ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఒక ప్రకటనలో కోరారు. సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ సభ్యులు హాజరు కావాల్సిందిగా కోరారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సబ్బవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అంతకాపల్లి సబ్ స్టేషన్‌లో అడిషినల్ బ్రేకర్ పనుల కారణంగా ఆ పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈకారణంగా గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, మొగలిపురం, బోదివలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపుర అగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొట్టివాడ, పెదయాతపాలెం, అడ్డూరు, ఎల్లుప్పి, లగిశెటిపాలెం, బంగారమ్మపాలెం గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయాలి

పరవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారిలో గల మండల పరిషత్ కార్యాలయ జంక్షన్, బొంకులదిబ్బ వీధి, పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో స్పీడ్ బ్రేకర్లకు రంగులు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో వేగంగా వచ్చే ద్విచక్ర వాహనదారులు స్పీడ్ బ్రేకర్లను గమనించలేక ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇటీవల కాలంలో ప్రమాదాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ శాఖాధికారులు తక్షణమే స్పందించి స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేసేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

నిల్వ ఆహారం తిని మోదకొండమ్మ భక్తులకు అస్వస్థత

పాడేరురూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోదకొండమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు వారితో తీసుకువచ్చిన ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్థానిక జీజీహెచ్‌ఆర్‌ఎంల్లో చికిత్స పొందడంతో కోలుకుని తమ ఊళ్లకు బయలుదేరి వెళ్లారు. వివరాలివి.. స్థానిక మోదకొండమ్మను దర్శించుకొనేందుకు అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 19 మంది భక్తులు శనివారం పాడేరు చేరుకున్నారు. వారితో తెచ్చుకున్న ఆహారాన్ని శనివారం అర్ధరాత్రి తరువాత తినడంతో అరగక వాంతులు, విరేచనాలకు గురయ్యారు. వెంటనే వీరంతా జీజీహెచ్‌లో శనివారం రాత్రి 2 గంటల సమయంలో చేరారు. డాక్టర్ వెంకట్ వైద్యం అందించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా జీజీహెచ్‌కు చేరుకొని వారికి అందుతున్న వైద్య సేవలపై పర్యవేక్షించారు. వారికి అత్యవసర వైద్య సేవలు అంది కోలుకోవడంతో ఆదివారం మధ్యాహ్నం డిశ్చార్జ్ అయి స్వగ్రామాలకు వెనుదిరిగారనిడాక్టర్ వెంకట్ తెలిపారు.

సప్పర్ల రెయిన్‌గేజ్ వద్ద రోడ్డుపైకి అడవి గేదె

» బస్సు డ్రైవర్ హారన్‌తో రోడ్డు పక్కనే పొదల్లోకి..


శనివారం రాత్రి రహదారి పక్కన పొదల్లో అడవిగేదె

నీలేరు, జూన్ 15, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సప్పర్ల రెయిన్‌గేజ్ వద్ద శనివారం రాత్రి పాడేరు నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు అడ్డంగా అడవి గేదె వచ్చింది. ఒక్కసారిగా రహదారి మధ్యలో ఈ గేదె ఉండటాన్ని గమనించిన డ్రైవర్ తొలుత భయాందోళనకు గురయ్యాడు. అనంతరం గట్టిగా హారన్ కొట్టే సరికి ఆ అడవి గేదె నెమ్మదిగా రోడ్డు పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లి నిలబడింది. ఇది గమనించిన బస్సులోని ప్రయాణికులు ఈ అడవిగేదేను తమ సెల్ ఫోనుల్లో బంధించారు. గతం లో కూడా ఇదే సప్పర్ల రేయిన్ గేజ్ సమీపంలోనే డొంకరాయి నుంచి పాడేరు వె ళ్తున్న బస్సు చిరుతపులి కనిపించింది.

గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక: ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు స్థానిక ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. ఆదివారం మండలంలోని పెదవలస పంచాయతీ రంపుల గ్రామంలో దర్తి అబ పీఎం జన్‌మన్ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రధానంగా గిరిజనులకు ఆధార్, రేషన్, జాబ్ కార్డులు, గ్యాస్ కనెక్షన్లు, రేషన్ అందుతుందా లేదా అని ఈ గ్రామ సభల్లో పరిశీలిస్తున్నామన్నారు. గిరిజనులకు అందుబాటులోలేని వివిధ పథకాలు సకాలంలో అందజేస్తామన్నారు. గ్రామంలో అర్హులకు గృహాలు మంజూరుకాలేదని, జీసీసీ డీఆర్ డిపో శిథిలావస్థలోవుందని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. గ్రామ సభలో ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటుచేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈకార్యక్రమంలో ఎంపీడీవో, నోడల్ అధికారి వై. ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ఆనందరావు, దేముళ్లు, సర్పంచ్ వంశీ కృష్ణ, టీడీపీ మండలాధ్యక్షుడు ముక్కలి మహేశ్, జడ్పీటీసీమాజీ సభ్యురాలు గంటా నళిని పాల్గొన్నారు.

84 మందికి పింఛన్లు మంజూరు

కొయ్యూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో 84 పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు తెలిపారు. స్పౌజ్ కోటాలో కేటాయించినట్టు చెప్పారు. సచివాలయాల వారీగా ఆడాకులలో 6, బకులూరు 4, బంగారమ్మపేట 12, బూదరాళ్ల 2, చీడిపాలెం 1, చిట్టింపాడు 5, డౌనూరు 11, కంతారం 2, కొమ్మిక 4, కొండ గోకిరి 1, కొయ్యూరు 6, ఎం. భీమవరం 1, ఎం. మాకవరం 4, మంప 5, మర్రివాడ, 3, నడింపాలెం 2, రావణాపల్లి 3, రాజేంద్రపాలెం 2, రేవళ్ళు 1, శరభన్నపాలెం 3, యు చీడిపాలెం 6 మంజూరైనట్టు చెప్పారు.


సరియా గ్రామంలో ఉపాధ్యాయుడులేని పాఠశాలలో విద్యార్థులు


ఆందోళన వ్యక్తంచేస్తున్న పిల్లలతో తల్లిదండ్రులు

ఏడాదికిపైగా చదువుకు దూరం

» సరియా, బెంబి గ్రామాల్లో విద్యార్థుల పరిస్థితి

» సాంకేతిక సమస్యతో యూ డైస్‌లో యాడ్ కానీ పాఠశాలలు

» ఈ ఏడాదీ ఇంకా తెరచుకోని వైనం

అనంతగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనబాడు పంచాయతీ సరియా జీఎస్ పాఠశాల ఏడాదిగా తెరచుకోకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ఈ పాఠశాల అనంతగిరి మండలంలో ఉన్నప్పటికీ గతంలోని హుకుంపేట మండలం బాకూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో నడిచేది.. ఏడాదిన్నర క్రితం ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లిపోవడంతో ఈ పాఠశాల మూతపడింది. దీనిపై గత ఏడాది ఆగస్టులో 'బడిలేని బడిలో జెండా పండగ శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించి, బాకూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధి నుంచి ఉపాధ్యాయురాలిని నియమించారు. ఆమె నెలరోజుల పాటుగా బో.దించి తరువాత రాలేదు. దీంతో సమస్య మొదటికే వచ్చింది. ఇటీవలే ఈ ఏడాది నుంచి సరియా, బెంబీ రెండు జీపీఎస్ పాఠశాలను అనంతగిరి మండలం పినకోట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోకి మార్పు చేశారు. సాంకేతిక సమస్యలతో యూ డైస్‌లోని ఈ పాఠశాల యాడ్ కా లేదు.. ఈ ఏడాది కూడా ఇంకా ఈ స్కూల్స్ పునఃప్రారంభం కాలేదు. సరియా పాఠశాలకు రోజూ విద్యార్థులు వెళ్లి కొంత సేపు కూర్చుని వచ్చేస్తున్నారు. ఉపాధ్యాయుడు లేక బోధన లేకుండా పోతోంది. ఏడాదిన్నపాటుగా తమ పిల్లలు చదువుకు దూరమయ్యారని, వారి భవిష్యత్తు ఎలా ఉంటుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అలాగే, ఈ ఏడాది తమ పిల్లల చదువు లేదు.. తల్లికి వందనం లేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రహదారుల విస్తరణ అడ్డుకుంటే సహించేది లేదు

ఏజెన్సీ ప్రాంత రోడ్డు అభివృద్ధి వేదిక సంఘ ప్రతినిధుల హెచ్చరిక


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వేదిక సంఘ నాయకులు

పాడేరురూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఆదివాసీ ప్రాంతంలో రహదారుల అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని ఏజెన్సీ ప్రాంత రోడ్డు అభివృద్ధి వేదిక సంఘ ప్రతినిధులు హెచ్చరించారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో సంఘం ప్రతినిధులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూడా రాధాకృష్ణ, వంతాల నాగేశ్వరరావు, వందేమాతరం శ్రీనన్న, కిట్టుకురు జోసెఫ్, తాపుల కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ మండల కేంద్రాల్లో రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించి,విస్తరణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారికి ఇరువైపుల 100 అడుగుల రోడ్డు విస్తరణకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ దినేశ్ కుమార్ ప్రకటించారన్నారు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన పాడేరు పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు 10 షాపులను తొలగించారు. అనంతరం పట్టించుకోలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులను కాపాడే ఆలోచనతో పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుందన్నారు. అధికారులు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. చీఫ్ అడ్వయిజర్‌గా వందేమాతరం శ్రీనన్న, సలహాదారులుగా ఎస్.ధర్మానపడాల్, కె.రాధాకృష్ణ, వి.నాగేశ్వరరావు, కె.జోసెఫ్, కన్వీనర్‌గా జి.భాను సీహెచ్‌రావు,కో-కన్వీనర్‌లుగా సీహెచ్.రాజబాబు, పి.నరేశ్, ఎస్.రవీంద్ర, కె.మున్నా, కె.శివ, పి.శేషు, మధుసూదన్, సుందర్ తదితరులను కమిటీ సభ్యులుగా నియమించారు.

'బిల్లులందక నిలిచిపోతున్న ఇళ్ల నిర్మాణాలు'


లబ్ధిదారులతో మాట్లాడుతున్న సుంకరమెట్ట సర్పంచ్ చినబాబు

అరకులోయ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీవీటీజీ గిరిజనులకు మంజూరు చేసిన ఇళ్ల బిల్లులు చెల్లించకపోవడంతో అన్ని లింటల్ స్థాయిలో నిలిచిపోయాయని, తక్షణం ప్రభుత్వం స్పందించి బిల్లులు విడుదల చేయాలని గిరిజన సంఘం మం డల అధ్యక్షుడు, సుంకరమెట్ట పంచాయతి సర్పంచ్ గెమ్మెలి చినబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, అభివృద్ధికి దూరంగా ఉన్న పీవీటీసీలను గుర్తించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జన్‌మన్ పథకం కింద ప్రత్యేకంగా ఇళ్లు మంజూరు చేశాయన్నారు. ముందస్తుగానే ఒక్కో ఇంటికి రూ.70వేల లబ్ధిదారుని ఖాతాలో వేసి ప్రోత్సహించాయన్నారు. దీంతో దాదాపు శ్లాబ్ స్థాయి నిర్మాణాలు కొందరు,మరికొందరు లింటల్‌స్థాయిలో ఇంటి నిర్మాణాలు చేపట్టి మూడునెలలకు పైగా గడిచినా బిల్లులు మంజూరు కాలేదన్నారు.దీంతో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు నిలిపివేశారన్నారు. ఇకనైనా ఇళ్ల బకాయిలు చెల్లించాలని చినబాబు డిమాండ్ చేశారు.

ఒకే కుటుంబంలో నలుగురుకి తల్లికి వందనం

» లబ్ధిదారుల ఆనందం


పిల్లలతో తల్లికివందనం నగదు అందుకున్న సురేశ్, మణి దంపతులు

చింతపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడుపల్లి పంచాయతీ బయలుకించంగి రత్నగిరి కాలనీలో ఓ కుటుంబంలోనున్న నలుగురు విద్యార్థులకు తల్లికివందనం నగదు రూ.52వేలు తల్లి బ్యాంక్ ఖాతాలో జమయింది. ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రత్నగిరికాలనీలో నివాసముంటున్న మోరీ సురేశ్, మణి దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఈ నలుగురు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నుంచి ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఈ కుటుంబం తల్లికివందనం పథకానికి అర్హులు కావడంతో ప్రభుత్వం నలుగురు పిల్లలకు సంబంధించిన నగదును బ్యాంక్ ఖాతాలో జమచేసింది. ఈ సందర్భంగా తండ్రి సురేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుకి రుణపడివుంటామన్నారు. పిల్లలకు అ వసరమైన సామగ్రిని చింతలేకుండగా కొనుగోలు చేసి పాఠశాలకు పంపిస్తామని ఆయన తెలిపారు.

104 ఉద్యోగుల బకాయి వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నేత ఉమామహేశ్వరరావు

పాడేరురూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న 104 సర్వస్ ఉద్యోగుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. 104 రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం స్థానిక లోచలిపుట్టు పాఠశాల ప్రాంగణంలో 104 సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.సూర్యనారాయణ పడాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ, రాష్ట్రంలో 104 సర్వీస్‌లను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహించిందని, ఆ సంస్థ ఉద్యోగులకు రెండు నెలలు వేతనాలు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయి వేతనాలు, ఈఎల్, గ్రాడ్యుటీ చెల్లించాలన్నారు. ప్రస్తుతం 104 సర్వీసులు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఉద్యోగులకు ప్రతీ నెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో ఉద్యోగులకు మ్యూచ్‌వల్ బదిలీలు చేసి మిగిలిన స్థానాల్లో కొత్త ఉద్యోగుల నియామకాలు చేపట్టాలన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.పవణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి బి.రామ్మూర్తినాయుడు, జిల్లా, డివిజన్ నాయకులు పి.భీమరాజు, అప్పలరాజు, ఎం.శ్రీనివాస్, జి.నవీన్ కుమార్, ఎస్.గణపతి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి, హుకుంపేటల్లో భారీ వర్షం

» వాగులను తలపించిన రోడ్లు... రాకపోకలకు ఇక్కట్లు


చింతపల్లిలో కురుస్తున్న వర్షం

చింతపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఆదివారం కొన్ని మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. చింతపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం ఒంటిగంట నుంచి రెండు గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు, చెరువులు వర్షపు నీటితో నిండుకున్నాయి. వర్షం వల్ల కోరుకొండ వారపు సంతల్లో వర్తకులు, వినియోగదారులు అవస్థలు పడ్డారు.

హుకుంపేటలో..

హుకుంపేట మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్డు, డ్రైనేజీల్లో వర్షపు నీరు భారీగా ప్రవహించింది. అడ్డుమండల ప్రధాన రోడ్డుపై నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.


పెదబయలు: రాళ్లు తేలిన గోమంగి ప్రధాన రహదారి


అనంతగిరి: కోతకు లోనైన పెద్దూరు నుంచి మాలింగవలస వెళ్లే రోడ్డు

రహదారులు ఛిద్రం.. ప్రయాణం నరకం

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో గ్రామాల్లో జనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పలు రోడ్లు వర్షాలకు బురదమయమయ్యాయి. కొన్నిచోట్ల కోతకు లోనై నడవడానికి వీలుకానంతగా ఛి ద్రంగా మారాయి.

పెదబయలు జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారుమెట్ట నుంచి గోమంగి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదభరితంగా మారింది. నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. పర్రెడా పంచాయతీ లక్ష్మీపురం గ్రామ సమీపంలోని బంగారుపుట్టు జం క్షన్ వద్ద రోడ్డు ఓ వైపు భారీగా కోతకు గురవ్వడంతో ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. సుమారు ఐదడుగుల మేర లోతు వరకు కోతకు గురైంది. ఏడాదిగా ఈ స మస్య ఉంది. పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా క్రమేణా రోడ్డు మరింత కోతకు గురై లోయగా మారింది. ఆ ప్రదేశంలో ఏ మాత్రం ఏమరుపాటుగా వాహనం నడిపినా ప్రమాదం బారిన పడినట్టే. ఇకనైనా అధికారులు స్పందించి బంగారుపుట్టు జంక్షన్ వద్ద గోతినైనా మూసివేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అనంతగిరి మండలంలో..

అనంతగిరి: మండలంలోని పెద్దూరు నుంచి మాలింగవలస గ్రామం వరకు వెళ్లే రోడ్డు మొత్తం గోతులు, కోతకు లోనై రాకపోకలకు గిరిజనులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మార్గమంతా చిత్తడిగా మారింది. మెటల్ కొట్టుకుపోయి, రోడ్డంతా అధ్వాన స్థితికి చేరింది. దీంతో ఈ మార్గంలోని పాతకోట, రేగం, మాలింగవలస, తేనెపుట్టు, తలారీపాడు గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో ఈ రహదారి పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం స్పం దించి బిల్లులు జాప్యం లేకుండా చూడాలని, పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

లభించని గల్లంతైన పర్యాటకుని ఆచూకీ


డుడుమ జలపాతంలో గాలింపులు చేపడుతున్న సహాయక బృందాలు

ముంచంగిపుట్టు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏవోబీ)లో గల డుడుమ జలపాతంలో గల్లంతైన పర్యాటకుడు అనిమెష్‌దాస్(27) ఆచూకీ ఆదివారం సైతం కానరాలేదు. కోల్‌కతాకు చెందిన అనిమెష్‌దాస్ కుటుంబ సభ్యులతో కలసి శనివారం డుడుమ జలపాతాలను చూసేందుకు వచ్చి ప్ర మాదవశాత్తు జలపాత ప్రవాహంలో మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. ఒడిశా లంతాపుట్టుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది, కొరాపుట్టుకు చెందిన(ఓడీఆర్‌ఎఫ్) సహాయక బృందాలు గత రెండు రోజులుగా జలపాతంలో విస్తృత గాలింపులు చేపడుతున్నారు. అయినా, గల్లంతైన పర్యాటకుడు ఆచూకీ కానరాలేదు. మరో మారు సోమవారం ఉదయం నుంచి గాలింపులు చేపడతామని సహాయక బృందాలు తెలిపారు.

నింగీ నేలా ముద్దాడినట్టు...!


జి.మాడుగులలో ఆదివారం సూర్యోదయం వేళలో దృశ్యం

జి.మాడుగుల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కొండలను తాకుతూ పైన నీలి మేఘాలు.. కిందిన చిక్కని ముదురు ఆకుపచ్చని చెట్టు.. మధ్యన నల్లటి తారురోడ్డు.. ముదురు గోధుమ వర్ణంలో మట్టి రోడ్డు.. ఇరువైపులా అస్తవ్యస్తంగా ఉన్న ఇళ్లు.. ఉదయ భానుని వెలుగు.. ఎవరో ప్రఖ్యాత చిత్రకారుడు విరచించించిన చిత్రంలా ఉన్న ఈ దృశ్యం జి.మాడుగులలోనిది. ఆదివారం సూర్యోదయం వేళ నింగి నేలను ముద్దాడినట్టున్న ప్రకృతి సోయగం ఎంతగానో ఆకట్టుకుంది. శనివారం సాయంత్రం వరకు వర్షం కురవడంతో ఆదివారం ఉదయం సూర్యుడు ఉదయించే వేళ ప్రకృతి ఇలా దర్శనమిచ్చింది. ఈ దృశ్యాన్ని పులువురు మొబైల్స్‌లో పదిలపరిచారు.

పొగమంచు అందాలు...


అనంతగిరిలో సాయంత్రం పొగమంచు

అనంతగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివారం విభిన్న వాతావరణం చోటుచేసుకుంది. ఉదయం ఎండతీవ్రంగా ఉండగా.. మధ్యాహ్నం నుంచి భారీ వర్షంతో చల్లబడింది.. సాయింత్రం 5 గంటల సమయంలోని ఒక్కసారిగా పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. లైట్లువేసుకుని ప్రయాణాలు సాగించారు. కొంతమంది పొగమంచు అందాలను ఆస్వాదించారు.

కొయ్యూరులో 36 డిగ్రీల ఉష్ణోగ్రత

పాడేరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మన్యంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి, దీంతో ఏజెన్సీలో ఆదివారం కొయ్యూరులో 36.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా డుంబ్రిగుడలో 32.2, పెదబయలులో 31.3, అరకులోయలో 30.2, హుకుంపేటలో 30.1, జి.మాడుగులలో 29.9, పాడేరులో 29.4, జీకేవీధిలో 28.9, చింతపల్లిలో 27.5, అనంతగిరిలో 24.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మొక్కలను సద్వినియోగం చేసుకోవాలి

జి.మాడుగుల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నాంది స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన మొక్కలను సద్వినియోగించుకోవాలని టీడీపీ సీనియర్ నేత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి. అప్పన్నదొర కోరారు. మండలంలోని కుంబిడిసింగిలో ఆదివారం ఆ సంస్థ ద్వారా వివి పండ్ల, నీడనిచ్చే చెట్ల మొక్కలను ఒకోక్క కుటుంబానికి 300లు చొప్పున 70 మంది లబ్ధిదారులకు వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాంది సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వలస పక్షులు

... 5వ పేజీ తరువాయి

గత ఏడాది ఎన్నికల ముందే జనసేనలో చేరారు.

ఎన్నికల తరువాత అచ్యుతాపురం మండలంలో వలసలు

గత ఏడాది ఎన్నికల తరువాత దోసూరు ఎంపీటీసీ సభ్యురాలు రాజాన పద్మజ (అప్పారావు), మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఉప్పవరం సర్పంచ్ సకల ఉమామహేశ్వరి, ఆవరాజాం ఉప సర్పంచ్ పిల్లి సత్తిబాబు జనసేనలో చేరారు. మరో ఆరుగురు వైసీపీ సర్పంచులు, ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు జనసేనలో చేరడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

మునగపాక మండలంలో..

రాజుపేట సర్పంచ్ కిల్లాడ దేముళ్లు, గంటవానిపాలెం సర్పంచ్ కోన వెంకటలక్ష్మి, మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, చెర్లోపాలెం ఎంపీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ బొజా లక్ష్మి, నాగులాపల్లి-1 ఎంపీటీసీ సభ్యురాలు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి జనసేనలో చేరారు. ఉమ్మలాడ సర్పంచ్ సూరిశెట్టి గంగయ్యమ్మ భారతీయ జనతా పార్టీలో చేరారు.

ఎలమంచిలి మండలంలో..

ఎలమంచిలి మండలం రేగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్ ఎంపీపీ రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు, పురుషోత్తపురం సర్పంచ్ అయిన ఆయన భార్య రాజాన సునీత, ఎలమంచిలి వైస్ ఎంపీపీ, జంపపాలెం ఎంపీటీసీ సభ్యురాలు శిలపరశెట్టి ఉమ జనసేన పార్టీలో చేరారు.

రాంబిల్లి మండలంలో...

దిమిలి సర్పంచ్ బంగారు చిలుకు, కొత్తూరు సర్పంచ్ నానేపల్లి లక్ష్మి, కృష్ణంపాలెం సర్పంచ్ ఫైల సత్తిబాబు, కట్టుబోలు ఎంపీటీసీ సభ్యుడు జనపరెడ్డి చిన్న, మురకాడ ఎంపీటీసీ సభ్యుడు అమలుకంటి తాతాజీ, రజాల సర్పంచ్ పొన్నాడ లక్ష్మి.

డీసీఎంఎస్‌కు పూర్వ వైభవం

... 5వ పేజీ తరువాయి

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మళ్ల సురేంద్ర, పీవీజీ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు, కూటమి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, మాదంశెట్టి నీలబాబు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పోల్నాటి అప్పారావు, డీసీఎంఎస్ బీఎంసత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కోట్ని బాలాజీ స్వగ్రామమైన అనకాపల్లి మండలం బవులవాడ నుంచి నెహ్రూచౌక్, మెయిన్‌రోడ్డు, రింగురోడ్డు మీదుగాఫంక్షన్ హాలు వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. బాలాజీని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

ఈ సంఘటనకు సంబంధించి పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రింగురోడ్డులోని ఒక అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న జంపా ప్రేమ్ చంద్ కుమార్తె మహిమాచంద్ (17) ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదివింది. మార్చిలో జరిగిన పరీక్షల్లో మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యింది. దీంతో గత నెలలో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షలు రాసింది. ఇటీవల విడుదల అయిన ఫలితాల్లో ఆమె పాసైంది. కానీ అనుకున్న మార్కులు రాలేదని మనస్తాపం చెందింది. ఆదివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు గమనించి కిందకు దించారు. చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. మృతురాలి తండ్రి ప్రేమ్‌చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కాళ్ల పారాణి ఆరకముందే...

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. ప్రస్తుతం దంపతులిద్దరూ గాజువాకలోనే నివాసం ఉంటున్నారు. శనివారం సాయి పుట్టినరోజు కావడంతో సెలవు లేని కారణంగా ల్యాబ్‌లోనే ఉండిపోయారు. ఆదివారం నగరంలోని ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు ములగాడ రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో మారుతి జంక్షన్ వద్ద ఓ ట్రాలర్ వెనుక నుంచి వీరి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో వారిద్దరూ రోడ్డుపై తుళ్లిపడ్డారు. దీంతో సాయి అక్కడికక్కడే మృతిచెందగా, శాలిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన ట్రాలర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్యం.. అధ్వానం!

గ్రామాల్లో ఎక్కడిక్కడే చెత్త కుప్పలు

- వర్షాలకు భరించలేని దుర్వాసన
- రోగాల భయంతో వణుకుతున్న ప్రజలు
- కనీసం పట్టించుకోని అధికారులు
- ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం

గ్రామాల్లో 'చెత్త' వాతవరణం స్వాగతం పలుకుతోంది. ఏ ఊరిలో అడుగు పెట్టినా చెత్త కుప్పలు కుప్పలుగా తారసపడుతోంది. రహదారుల పక్కనే గుట్టలుగా పేరుకుపోయింది. వర్షాలకు కుళ్లిపోయి భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కొరవడుతోంది. ఫలితంగా ప్రజలను రోగాల భయం వెంటాడుతోంది.

మాకవరపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చన్నపాలెం, జికోడూరు, దుంగల వానిపాలెం తదితర గ్రామాల్లో చెత్త కుప్పలుతో పాటు వ్యర్థాలు పెరుగుపోయాయి. పంచాయతీ సిబ్బంది వీటిని తొలిగించడంలో తీవ్రమైన నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొన్ని చోట్ల రహదారులపైనే చెత్త కుప్పలకు నిప్పుపెట్టి విడిచి పెడుతున్నారు. అయితే ప్రతీ శని వారం స్వచ్ఛత సేవా కార్యక్రమం అంటూ అధికారులు ప్రచారం చేయడం తప్పితే చె(చి)త్తశుద్ధి మాత్రం కానరావడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు.

లచ్చన్నపాలెం గ్రామంలో చెత్త సంపద కేంద్రం లేక పోవడంతో రహదారులపైనే చెత్తను కుప్పలుగా వేసి ఒకేసారి నిప్పు పెడుతున్నారు. దీనివల్ల వచ్చే పొగకు రహదారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలు ఉక్కిరిబిక్కిరివుతున్నారు. అలాగే జి.కోడూరు గ్రామంలో ఎక్కడబడితే అక్కడ చెత్తను పడేస్తున్నారు. నెల రోజులుగా ఇక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. గ్రామ సచివాలయం భవనం వద్ద కూడా చెత్త కుప్పలు తారసపడుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం. ఉద్యోగులు ఆ చెత్తను దాటుకుని సచివాయలంలోకి వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు తప్పితే, చెత్తను మాత్రం తొలిగించే ప్రయత్నం చేయడం లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. అలాగే ఈ గ్రామంలోని పాఠశాలల వద్ద చెత్త కుప్పలుగా పేరుకుపోయి కనిపిస్తోంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలకు ఈ చెత్త కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నదని, దీంతో అక్కడ ఉండలేకపోతున్నామని వారు గగ్గోలు


జి.కోడూరులో గ్రామం మధ్యలో చెత్త కుప్పలు

పెడుతున్నారు. చెత్తను తొలగించాలని ఇటీవల ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు అసహసం వ్యక్తం చేస్తున్నారు.

అలాగే దుంగలవానిపాలెం గ్రామంలోని పంట కాలువలో చెత్తను వేసి కప్పివేసేన్నారు. కాలువలో చెత్త పెరిగిపోయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో చెత్త కుప్పలు పెరిగిపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తీవ్ర దుర్వాసన వస్తున్నదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. దీనివల్ల ఎప్పుడు ఏ రోగం ప్రబలుతుందోనని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామాల్లో చెత్త కుప్పలను వెంటనే తొలగించాలని, పారిశుధ్యం మెరుగుపరిచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.


జి.కోడూరు సచివాలయం వద్ద చెత్తాచెదారం


లచ్చన్నపాలెంలో రహదారికి ఆనుకుని పేరుకుపోయిన చెత్త కుప్పలు

అ'పూర్వ' కలయిక ఆనందకరం

స్పీకర్ అయ్యన్నపాత్రుడు


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సుమారు 50 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలుసుకోవడం ఆనందంగా ఉందని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద 1973-1975 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు సుమారు 70 మందికిపైగా స్పీకర్ అయ్యన్న పాత్రుడుతో పాటు కలుసుకున్నారు. కాలేజీ చదవే రోజుల్లో చేసిన చిలిపి పనులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఇంటర్‌లో చదువుకుని ఇవాళ మళ్లీ అందరం కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం అప్పుడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

వృద్ధులను వేధిస్తే కఠిన శిక్షలు

- సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు

చోడవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వృద్ధులను వేధించే వ్యక్తులకు కఠిన శిక్షలు ఉంటాయని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు హెచ్చరించారు. స్థానిక వాసవీకిరాణా సంఘం భవనంలో ఆదివారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా వృద్ధులకు చట్టం కల్పించిన హక్కులు, రక్షణ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వృద్ధులను వేధించడం సరికాదన్నారు. వారి అనుభవనాలను యువతరం తెలుసుకోవాలన్నారు. వృద్ధులకు అగౌరవపరచినా, వేధించినా చట్ట ప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. సదస్సులో సీనియర్ సిటిజన్స్ యాక్ట్, మనోవర్తి, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు కె.వెంకటరావు, బొలై పైడిరాజు, కిరాణా సంఘం నాయకులు, వర్తకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పిల్లల యోగాసనాల ప్రదర్శన


యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

నర్సీపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల యోగాసనాలు ప్రదర్శన ఆకట్టుకుంది. బలిఘట్టం హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు ఆదివారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో యోగసనాలు వేశారు. ముందుగా ప్రార్థన గీతంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగాసనలు వేసిన చిన్నారులకు వాకర్స్ క్లబ్ సభ్యులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షులు కుప్పిలి స్వామి, రంగారావు, ట్రెజరర్ అల్లు అప్పారావు, సభ్యులు అంకిత సత్యనారాయణ, పోలుపర్తి వెంకునాయుడు, అడిగర్ల వరహాలనాయుడు, మురళీ పాల్గొన్నారు.

వర్షాలతో అస్తవ్యస్తంగా రహదారులు


అధ్వానంగా తయారైన బస్ స్టేషన్ రహదారి

కృష్ణాదేవిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామీణ రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఏఎల్‌పురం, కొంగశింగి, సిహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట తదితర గ్రామాల్లో వర్షం పడడంతో రహదారులపైన గోతుల్లో నీరు చేరి అధ్వానంగా ప్రమాదకరంగా మారాయి. అలాగే కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలోని రోడ్డు దారుణంగా తయారైంది. మట్టి రోడ్లు బురదమయమయ్యాయి. సంబంధిత అధికారులు రహదారులను మెరుగుపర్చాలని ఆయా ప్రాంతా ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ


పుర వీధుల్లో ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మాడుగుల, మే 15 (ఆంధ్ర జ్యోతి): మాడుగుల మోదకొండమ్మ ఘటాల పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారు నుంచే భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించారు. కొందరు భక్తులు ఘటాలతో పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎం.అలమండ శివాలయంలో ప్రత్యేక పూజలు


శివాలయంలో పూజలు చేస్తున్న గ్రామస్థులు

దేవరాపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అమండ శివాలయం 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. స్వామివారికి 101 కలశాలతో భక్తులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షేమం, అభివృద్ధే సీఎం చంద్రబాబు అజెండా

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు
- ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్.రాజు, బండారు సత్యనారాయణమూర్తి

చోడవరం/బుచ్చెయ్యపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి సంక్షేమం, అభివృద్ధే సీఎం చంద్రబాబునాయుడు అజెండా అని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు చెప్పారు. చోడవరం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం సీఎం సహాయనిధి కింద నియోజకవర్గంలోని చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని లక్ష్మీదేవి పేటకు చెందిన నాగిరెడ్డి వరహామూర్తికి రూ.38,727, జన్నవరం గ్రామానికి చెందిన గుమ్మాల దేముడుకి రూ.65,811, నరసాపురానికి చెందిన అల్లు రాజశేఖర్‌కు రూ.42,461, పిల్ల బుల్లమ్మకు రూ.74,966, రావికమతం మండలం బలిజ పోర్నీష్‌కు రూ.2.59 లక్షలను పంపిణీ చేశారు. అలాగే బుచ్చెయ్యపేట మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ లక్కోజు నారాయణరావుకు రూ.1.8 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యం పొందేందుకు హాస్పటల్ బిల్లులను కార్యకర్తల ద్వారా అందిస్తే సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ నాయకులు ఎర్రంశెట్టి చిన్న, గోకివాడ కోటేశ్వరరావు, డొంకిన అప్పలనాయుడు, వై.అప్పలనాయుడు, ఎంవీవీ.సత్యనారాయణ, కోట సత్యనారాయణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ అండ: ఎమ్మెల్యే బండారు

చీడికాడ, జూన్ 15 (ఆంధ్ర జ్యోతి): కష్టాల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. చీడిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సత్తిబాబుకు వైద్య సేవల కోసం రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరికైనా అనారోగ్య సమస్యలు వస్తే తమను సంప్రదించాలని, వారి వైద్య సేవల కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, నాయకులు వి.ఎర్రినాయుడు, జి.రామునాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు చేయాలి

గొలుగొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు చేయాలని టీడీపీ చీడిగుమ్మల అధ్యక్షుడు కామిరెడ్డి గోవింద కోరారు. గ్రామంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.90 లక్షలు మంజూరు చేశారన్నారు. అయితే వడ్డీలకు అప్పలు తెచ్చిమరీ అయ్యన్న చెప్పినట్టుగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వారం వారం బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, పది నెలలైనా బిల్లులు పడకపోవడంతో ఎదురు చూపులు చూస్తున్నామని వాపోయారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సంబంధిత అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

భవనాలు నిరుపయోగం కాకూడదు: ఎంపీపీ

దేవరాపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉండకూడదని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఎం.అలమండ ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న రెండు సామాజిక భవనాల మరమ్మతు పనులకు జడ్పీ నిధులు రూ.9.7 లక్షలతో ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచంనాయుడు, సర్పంచ్ దాడి జగన్, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, నాయకులు ప్రసాద్, యామాద్రి పోలీసు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరి విత్తనాలకు ఎదురుచూపులు

నాతవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వర్షాలకు చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో చెరువుల కింద రైతులు వరినారు మడులను సిద్ధం చేసుకున్నారు. వారంతా వరి విత్తనాల కోసం రైతుసేవా కేంద్రాలకు తిరుగుతున్నారు. అధికారులను అడిగితే ప్రభుత్వం సరఫరా చేయలేదని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి వరి విత్తనాలు అందజేయాలని వారు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావికమతం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ, పి.పొన్నవోలు పంచాయతీల పరిధిలో సోమవారం విద్యుత్ నిలివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

నవ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

మాకవరపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో అడిగర్లపాలెం గ్రామంలో నవగ్రహాల పతిష్ఠ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఇటీవల నిర్మించిన నూకాంబిక అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ రమణ, వైసీపీ మండల యూత్ అధ్యక్షుడు రుత్తల రాజు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

బుచ్చెయ్యపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కరక మాజీ సర్పంచ్ యన్నంశెట్టి చిన సత్యారావును ఎమెల్యే రాజు ఆదివారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న సత్యారావుతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడుగోకివాడ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట ఎంపీడీవోకు అస్వస్థత

బుచ్చెయ్యపేట, జూన్ 15 (ఆంధ్ర జ్యోతి): ఎంపీడీవో వి.విజయలక్ష్మి అస్వస్థతకు గురయ్యారు. విశాఖపట్నంలోని వెంకోజిపాలెం ప్రైవేటు ఆస్పత్రిలో ఎంపీడీవో చికిత్స పొందుతున్నారు.

జనసేనను బలోపేతం చేయండి

పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

రోలుగుంట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జనసేన సిద్ధాంతాలను గ్రామ స్థాయిలోకి మరింతగా తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలని నియోజవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు సూచించారు. మండలంలోని కుసర్లపూడిలో ఆదివారం జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో కార్యకర్తలు అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. జనసేన పార్టీని గ్రామ స్థాయిలో మరింతగా బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఇందుకోసం పార్టీ గ్రామ శాఖలను ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ద్వారా ప్రజల అన్ని సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో పని చేద్దామని ఆయన పేర్కొన్నారు. ప్రతీ ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం వైపు పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎదర్కొంటున్న పలు సమస్యలను రాజు దృష్టికి తీసుకు వచ్చారు. వీటి పరిష్కారానికి జనసేన కృషి చేస్తుందని ఇన్‌చార్జి రాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి అల్లం రామ అప్పారావు, కార్యదర్శి సిరివరపు రమేశ్, మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, నాయకులు ద్వారపురెడ్డి రామకృష్ణ, బేతా సతీష్, పరవాడ దొరబాబు, లాలం నరసింగరావు, బుంగా కోటి, అరిపి త్రినాద్, ఇటంశెట్టి జగ్గునాయుడు, శనివాడ సోమాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో బ్లాక్ బెల్ట్ క్రీడాకారులకు అభినందన సభ


బ్లాక్‌బెల్ట్‌కు అర్హత సాధించిన క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో కోచ్‌లు

చోడవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో క్రీడలో బ్లాక్ బెల్ట్‌కు అర్హత సాధించిన క్రీడాకారులకు ఆదివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 14, 15 తేదీలలో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ బెల్ట్ అర్హత పోటీల్లో చోడవరానికి చెందిన డి.జాన్‌మార్క్, సాగర్, హేమ, జి.వి.శశివర్ధన్, జెస్సికా రోజిలి, వెంకటేశ్, సంతోషికుమారి, ఇసితా శారద, గండి రిషిత, రాఘవ, జయంత్‌లు బ్లాక్ బెల్ట్ సాధించారు. ఆదివారం నాటి కార్యక్రమంలో ఈ క్రీడాకారులను తైక్వాండో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీ కృష్ణ అభినందించి, వారికి బ్లాక్ బెల్టులు అందించారు. కార్యక్రమంలో కోచ్‌లు సింహాచలం, ప్రదీప్‌కుమార్, శేఖర్, అర్రెపు శ్రీనివాసరావు, జి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

'మాట నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుదే'


సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

చీడికాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మాట నిలబెట్టుకున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని బీసీ సెల్ జిల్లా కార్యదర్శి శరగడం శివ అన్నారు. బి.సింగవరం గ్రామంలో పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనంతో తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186